

# కావ్యాలా, సబ్బుబిళ్ళలా హెయిర్ ఆయిల్ సీసాలా

యువకవి ఎంతో కష్టపడి తన తొలికావ్యాన్ని విరచించాడు. నాలుగువారాలు ఊరంతాతిరిగి ఆఖరికి ఒక పబ్లిషర్ని ఒప్పించి తనకావ్యం వెలుగులోకి వొచ్చే ఏర్పాట్లుచేశాడు. అయితే ఏంలాభం? రెండు సంవత్సరాలు గడిచినా వేసిన ఆరువందల కాపీలూ అలాగే వుండిపోయాయి. కావ్యం "వెలుగు" లోకి రాలేదు. యువకవి గడ్డంపెంచడం మొదలుపెట్టాడు మొహంలో దిగులు గూడుకట్టుకోవడం ప్రారంభించింది. ఆ నిరాశలోనే రెండోకావ్యం వ్రాయడం జరిగింది. మళ్ళీ ఎక్కేగుమ్మం, దిగేగుమ్మం. చివరకి మళ్ళీ మరో పబ్లిషరు "దయతో" కావ్యప్రచురణకు అంగీకరించాడు.

ఆర్నెల్లు గడిచాయి. ఈ కావ్యకన్యకూడా తొలి కావ్యకన్య మల్లేనే 'అసూర్యంపశ్య' ఐపోయింది. యువకవికి మోకాళ్ళు పట్టేశాయి. పబ్లిషర్ని చూడ్డానికి కూడా భయంగా వుంది.

కొన్ని వారాలు గడిచాయి. అకస్మాత్తుగా పబ్లిషరు కారులోంచి దిగాడు. ఆయన మొహంలో ఏదో వింతకాంతి. "కవీ నీకు భయంలేదు అన్ని కాపీలు వెళ్ళిపోతాయి'' అన్నాడు. యువకవి సాష్టాంగం పడ్డాడు. "ఎలా సాధించావు గురూ ఈ విజయాన్ని'' అన్నాడు.

పబ్లిషర్ పరమేష్ఠి చిరునవ్వు నవ్వాడు "ప్రతి పుస్తకంతో రెండు సబ్బుబిళ్ళలూ ఒక హెయిర్ ఆయిల్ సీసా ఇస్తున్నాను. నీ కావ్యం హాట్ హాట్ కేక్‌లా పోతున్నది'' అన్నాడు.

యువకవి మూడో కావ్యంగురించి ఆలోచించడం మొదలు పెట్టాడు. ఈసారి తన కావ్యంతో ఇంకేయే వస్తువులు చెలామణి అవుతాయో అనే ఆలోచన అతని మస్తిష్కం వెనుక దాగివుంది!

---

గోపాలచక్రవర్తి